క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉండాలి

● నగర పంచాయతీ కమిషనర్ విశ్వేశ్వరరావు



ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వేశ్వరరావు

నెల్లిమర్ల: కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లిమర్ల నగర పంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు ఆదేశించారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, పంపు ఆపరేటర్లతో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. వర్షాల కారణంగా ఎక్కడా నష్టం జరగకుండా చూడాలన్నారు. వార్డులను సందర్శించాలన్నారు. చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తున్న దృష్ట్యా ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం

● సతివాడ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



ప్రధాన రహదారిపై చేరిన వర్షపు నీరు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ జంక్షన్‌కు ప్రమాదం పొంచి ఉంది. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తుతోంది. ఆర్అండ్‌బీ, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పలువురు షాపులు ఏర్పాటు చేసి కాలువలను కప్పేశారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్దనున్న కాలువను ఆక్రమించడంతో వర్షపు నీరు ప్రధాన రహదారి మీదుగా సతివాడ జంక్షన్‌కు చేరుతోంది. ఇదిలా ఉంటే పక్కనే ఉన్న ప్రధాన చెరువు పూర్తి స్థాయిలో నిండడంతో ఏ సమయంలోనైనా గండి పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వరద నీరు బయటకు పోయేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు..



పీహెచ్‌సీలో ఉన్న బాలింతలు

పూసపాటిరేగ: తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తమ పరిధిలోని గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రసవాలు జరిపించారు. తిప్పలవలస, నడిపల్లి, కోనాడ, తదితర గ్రామాలకు చెందిన గర్భిణులను ఆస్పత్రిలో చేర్పించి ఆదివారం సుఖ ప్రసవాలు చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యుడు రాజేష్‌వర్మ తెలిపారు. ముందుగానే పీహెచ్‌సీ సిబ్బంది అప్రమత్తమై గర్భిణులకు ప్రసవాలు జరిపించడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

బాధితులకు అండగా ఉంటాం..

● కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల నగరంలో కురుస్తున్న వర్షాలకు గాను లోతట్టు ప్రాంత వాసులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కురుస్తున్న వర్షాభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువస్థాయి సిబ్బందికి సూచనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఐదుగురు సిబ్బంది చొప్పున రోజుకు మూడు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే నష్టం వివరాలు తెలుసుకునేందుకు, ప్రజలకు అవసరమైన సహాయం చేసేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. గాడీఖానా వాసులను లార్డ్ కిచెనరీ ఎంపీ స్కూల్‌కు.. బుచ్చన్నకోనేరు వాసులను నూతివారి ఎంపీ స్కూల్‌కు.. రాజీవ్ నగర్ ప్రాంత వాసులకు ఎంజేబీయూపీ స్కూల్‌కు.. లంకవీధి, తోటపాలెం వాసులకు తోటపాలెం యూపీ స్కూల్‌కు.. అరకాల గెడ్డవీధి వాసులకు ఎస్ఆర్ స్కూల్‌కు.. దాసన్నపేట వాసులకు ఆనందగజపతి ఆడిటోరియం.. మంగళవీధి వాసులకు ఎంఆర్ కళాశాల ప్రాంతాలకు తరలించామని తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బంది పడేవారు 98499 06486 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.



నెల్లిమర్ల: గంగాజలం ప్యాకెట్లతో రూపొందించిన విగ్రహం

విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఘననాథుడి ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభయ్యాయి. భక్తులు ఇళ్లల్లో పూజలు నిర్వహించుకోగా... గ్రామాల్లో, ముఖ్య కూడళ్ల వద్ద వినాయక మంటపాలు వెలిశాయి. వివిధ ఆకృతుల్లో ఉన్న భారీ విగ్రహాలను మంటపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. పలుచోట్ల నిర్వాహకులు అన్నదానాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సిటీ బస్టాండ్‌లో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో స్వామివారిని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు దర్శించుకున్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుతూ నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడు ప్రదీప్‌నాయుడు, సిరిన హన్స దంపతులు ధర్మపురిలో పూజలు చేశారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని తూర్పు మహారాజుపేటలో గంగాజలాన్ని ప్యాకెట్లుగా చేసి వినాయక విగ్రహాన్ని రూపొందించారు. ఈ విగ్రహాన్ని చూడడానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు. – విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



సాక్షి ఫొటోగ్రాఫర్: ఎలుగుబంటి వారి వీధిలో కొలువుదీరిన గణనాథుడు

గజానన.. నమోస్తుతే..



విజయనగరం రూరల్: గణపయ్యకు పూజలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్



సాక్షి ఫొటోగ్రాఫర్: ఎన్‌సీఎస్ రోడ్డులో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం



సాక్షి ఫొటోగ్రాఫర్: కంటోన్మెంట్ వద్ద కరెన్సీ నోట్ల అలంకరణలో గణపతి



సాక్షి ఫొటోగ్రాఫర్: రైల్వేస్టేషన్ రోడ్డులో మత్స్య గణపతి




సాక్షి ఫొటోగ్రాఫర్: బాలాజీ మార్కెట్‌లో కొలువుదీరిన వినాయకుడు



సాక్షి ఫొటోగ్రాఫర్: జొన్నగుడ్డి రోడ్డులో మర్రి ఊడల మధ్య గణపతి



విజయనగరం టౌన్: మయూరీ జంక్షన్ వద్ద కొలువైన వినాయకుడు



విజయనగరం టౌన్: పెదతాడివాడ ఏఎస్సార్ నగర్‌లో కొలువైన గణనాథుడు



సాక్షి ఫొటోగ్రాఫర్: ఎన్‌సీఎస్ రోడ్డులో ఆకట్టుకుంటున్న సెట్



డెంకాడ: గొడిపాలెం యాతపేటలో అయ్యప్పస్వామి ఆలయం మోడల్‌లో వేసిన వినాయక సెట్



సాక్షి ఫొటోగ్రాఫర్: బాలాజీనగర్ రోడ్డులో ఏడు కొండల సెట్‌లో గణపతి

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరామనారాయణం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, శ్రీమాన్ వంగీపురం రామానుజ అవార్డు గ్రహీత డాక్టర్ పి.స్వప్న హైందవి ప్రవచనం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కళాశాల విద్యార్థులతో నిర్వహించిన వయోలిన్ కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

అంధకారంలో నగర పంచాయతీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. ఆదివారం తెల్లవారు జామున వర్షం కురవడంతో నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి విద్యుత్ సిబ్బంది 33 కేవీ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నా సరఫరా పునరుద్ధరించలేకపోయారు. దీంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

విస్తారంగా వర్షాలు..

విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు మండలాల్లోని చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల చెరువులకు గండ్లు కూడా పడ్డాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డెంకాడ మండలం నాతవలస కూడలి వద్ద భారీగా నీరు చేరడంతో అధికారులు జేసీబీతో సహాయంతో నీటిని కాలువలోకి మళ్లించారు. ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే లోకం మాధవి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ స్వరూపారాణి సందర్శించారు. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో మాజీ ఎంపీపీలు కంది చంద్రశేఖర్, కర్రోతు బంగార్రాజులు పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. విజయనగరం మండలంలోని జొన్నవలస, పినవేమలి, దుప్పాడ, కోరుకొండపాలెం, కోరుకొండ రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. జొన్నవలస వద్ద పెద్ద చెరువు నిండిపోవడంతో చెరువును ఆనుకుని ఉన్న రోడ్డుపై రాకపోకలు నిషేధించినట్లు తహసీల్దార్ ఎస్.కూర్మనాథం తెలిపారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భోగాపురం మండల కేంద్రంలోని క్షీరసాగర చెరువుకు గండి పడింది. జాతీయ రహదారికి అనుకొని ఉన్న సింగం చెరువులోకి వరద నీరు చేరడంతో రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. సవరవిల్లి నుంచి జమ్మయ్యపేటకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో రాకపోలకు ఇబ్బందులు తప్పడం లేదు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం రూరల్: పినవేమలి గ్రామం నుంచి కోరుకొండపాలెం వెళ్లే దారిలో చెరువును తలపిస్తున్న రహదారి



డెంకాడ: పొంగిప్రవహిస్తున్న గొడిపాలెం పాలగెడ్డ రిజర్వాయర్



డెంకాడ: నాతవలస కూడలి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు



డెంకాడ: నాతవలస కూడలిలో జేసీబీతో సహాయంతో నీటిని మళ్లిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



విజయనగరం రూరల్: దుప్పాడ వెళ్లే దారిలో రోడ్డుపై నిలిచిన నీరు



భోగాపురం: : భోగాపురంలో సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



విజయనగరం క్రైమ్: పెద్దచెరువు లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డు వద్ద అధికారుల పరిశీలన

తీరప్రాంతంలో ఆర్డీఓ పర్యటన



తిప్పలవలసలో పర్యటిస్తున్న ఆర్డీఓ సూర్యకుమారి

పూసపాటిరేగ: మండలంలోని తీరప్రాంత గ్రామమైన తిప్పలవలసలో ఆర్డీఓ ఎం.సూర్యకుమారి ఆదివారం సాయంత్రం పర్యటించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ అధికారులు ఆలస్యంగా హెచ్చరికలు జారీచేయడంతో తీర ప్రాంతంలోని చింతపల్లి, పతివాడబర్రిపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు వేటకు వెళ్లిపోయారు. అయితే వాతావరణం సహకరించకపోవడంతో అతికష్టం మీద మత్స్యకారులు ఒడ్డుకు చేరారు. ఒడ్డుకు చేరిన బోట్లను ట్రాక్టర్ సాయంతో సురక్షిత ప్రాంతానికి చేరుస్తున్నారు. పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గుండం చెరువు నిండుకుండలా ఉంది. ఏ క్షణమైనా గండి పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



గండి పడే అవకాశం ఉన్న గుండం

శతశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి

● వయోజన విద్యాశాఖ డీడీ అల్లు సోమేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో శతశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వయోజన విద్యాశాఖ డీఈ అల్లు సోమేశ్వరావు సూచించారు. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా 2024 – 25 సంవత్సరానికి గాను జిల్లాలో 37 వేల మంది మహిళా సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకోసం ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ డీడీ సోమేశ్వరరావు

ఇళ్లల్లోకి చేరిన నీరు

విజయనగరం రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పెద్ద చెరువు నిండుకుండలా తయారైంది. చెరువు కింద ప్రాంతాలైన తోటపాలెం, ట్యాంక్ బండ్‌రోడ్డు, సాయినగర్, బొత్సపేట, నాయుడుకాలనీ, ఎల్ఐసీ భవనం వీధుల్లో వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు కావడంతో ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.